


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఆడింది 'ఆటా' పాడింది 'పాటా'

**నేను మొదటిసారి అమెరికా రావడానికి కిరణ్‌ప్రభగారే** కారణం, అలాగే రెండోసారి ఆటావాళ్ళకి నా పేరు సూచించినది ఆయనే. శ్రీ మాధవ్ దుర్భాగారు ఒక రోజు సాయంత్రం నాకు ఫోన్ చేసి "ఈసారి ఆటాకి గెస్ట్‌గా మిమ్మల్ని పిలుద్దాం అనుకుంటున్నాం" అన్నారు. అప్పటికి ఇంకా ఐదు నెలలు సమయం ఉంది. అందుకే వెంటనే 'సరే' అనేసాను. తర్వాత ఈ మాధవ్ దుర్భా, ఫణి డొక్కాకి మంచి స్నేహితుడనీ, వాళ్ళ ఇంటి దగ్గరే ఉంటారనీ తెలిసింది. అప్పటికి అప్పుడే మాధవ్‌ని కూడా అర్జెంటుగా 'తమ్ముడు' అనేసుకున్నాను.

ఈ ఫణి డొక్కా అట్లాంటాలో ఉంటాడు. 'టేకిట్ ఈజీ' అనే కాలమ్ కౌముదిలో రాయడం ద్వారా నాకు పరిచయం. ఓసారి ఇండియా వచ్చినప్పుడు 'శ్రమకోర్చి'- అలా ఎందుకు అంటున్నానంటే,- మా ఇల్లు సైనిక్‌పురిలో చాలా లోపలికి ఉంటుంది. శ్రమకోర్చి మా ఇల్లు వెదుక్కుంటూ వచ్చి 'అక్కా... నా పుస్తకానికి ముందు మాట రాయాలని' అన్నాడు.

నేను హాశ్చర్యపడి, హానందపడి, ఫణికి ముందుమాట రాద్దామని పుస్తకం తీసుకున్నాను. అందులో ఒకరని ఏమిటి? అందర్నీ, తన హాస్యంతో ఉతికి ఆరేసాడు. స్వామీజీలని, కవులని, గాయకులని, మిగతా కళాకారుల్ని, అందర్నీనూ! అయితే ఓ చోట 'దక్షిణానికి వెళ్ళే రిక్షా.. నీకు ఇదే తగిన శిక్షా' అంటూ, నేను అప్పుడు రాస్తున్న టీ.వీ సీరియల్ 'తూర్పు వెళ్ళే రైలు'ని కూడా ఏకిపారేసాడు. 'హమ్మో హమ్మో.. అదరగండం పిల్లడు' అనుకున్నా!

ఇంక నా రెండోసారి అమెరికా యాత్ర తలపెట్టగానే, ఇండియాలో తలకి మించిన భారమైన బాధ్యతలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి. అన్నింటినీ అధిగమించి, డైలాగ్స్ అందించాల్సిన షూటింగ్ పోస్ట్‌పోన్ చేయించి, తొందరగా బట్టలు సర్దుకుని, గిఫ్ట్స్ ప్యాక్ చేయించుకుని, మందులు కొనుక్కుని (అమ్మతోడు డాక్టర్ రాసినవే). నేను తయ్యారవుతుంటే, మా కాంతికిరణ్‌గారు "ఎన్ని పట్టుచీరలు పెట్టుకున్నారు?" అంటూ ఫోన్ చేసారు. నాలిక కొరుక్కుని అర్జెంటుగా పట్టుచీరలు పెట్టుకున్నాను.



మా అబ్బాయి అశ్విన్ భువనకృతి, వాళ్ళమ్మ సుభాషిణితో

ఇంతలో లిటిల్ ఛాంప్స్ ఫైనలిస్ట్ భువనకృతి అనే అమ్మాయి తల్లి ఫోన్ చేసి "మా అమ్మాయిని మీకు అప్పగిస్తున్నాను. జాగ్రత్తగా తీసుకెళ్ళండే!" అన్నారు. నాకు సంబంధించినంత వరకూ వస్తువులు కాకుండా మనుషులైతే నేను

జాగ్రత్తగానే తీసుకెళ్తాను?

"హో..ఎస్! అలాగే!" అనేసాను.

ఈ మాట ఆవిడ మా ఫ్లైట్లో వచ్చే మిగతా తొమ్మండుగురికీ కూడా చెప్పారుట.

ఎయిర్ పోర్ట్‌లో అడుగు పెట్టగానే, తెలుగు చిత్రసీమని దద్దరిల్ల చేసే కమేడియన్స్ చాలామంది కనిపించారు. ఏ.వి.ఎస్, గుండు హనుమంతరావూ, వేణుమాధవ్, శ్రీనివాసరెడ్డి, హేమా వీరుకాకుండా ఏంకర్ శిల్పా చక్రవర్తి. ఈ అమ్మాయి ఫ్రెష్‌గా రైల్వే జూనియర్ కాలేజీ, హైదరాబాద్ లోంచి తీసుకొచ్చి, 'అనూహ్య' అనే ఈ టీ.వీ సీరియల్‌లో వేషం ఇచ్చింది డైరెక్టర్ గిరిధర్ గారైతే, తెలుగులో డైలాగ్ చెప్పడం నేర్పించింది నేనే. ఇప్పుడు 'వసకోకిలలా' అనర్గళంగా తెలుగు మాట్లాడేస్తుంది. (ఆహ్వానం అనడానికి ఆవానం అంటుంది... అదొక్కటే పలకదు.)

స్వాతీసోమనాథ్, గొప్ప నాట్యకళాకారిణి, అంతకన్నా ముందు చెప్పుకోవలసింది, 'కస్తూరిబా గాంధీ కళాశాల'లో నా క్లాస్‌మేట్.

గోరేటి వెంకన్నగారు, తెలంగాణా జానపద కవి, గొంతెత్తి పాడుతూ, చిందేస్తే, ఉరుము ఉరిమి మగలం మీద పడ్డట్లే. గొప్ప గాయకులు.

సహస్రావధాని శ్రీ గరికపాటి నరసింహారావుగారు.. ఈయన సాక్షాత్తు సరస్వతీ స్వరూపం. ఈయన అవధానం చూడని తెలుగువారు దురదృష్టవంతులు.

మేమంతా పక్క పక్క సీట్లలో కూర్చుని పంతొమ్మిది గంటలు ఫ్లైట్‌లో ప్రయాణం చేసాం.

గుండు హనుమంతరావుగారు మాటమాటకీ 'నానీ'లు చెప్తారు. 'ఈ అమెరికా మనని చూసి హా మెరికలు' అంటుంది లాంటివి. వేణుమాధవ్ ఇంక చెప్తే మర్యాద దక్కదని బెదిరిస్తున్నా, హేమ "మీరు ఆనందిస్తే ఇంకా ఇంకా చెప్తాడు వినకండి" అని మొత్తుకుంటున్నా ఆ కవిత్వధార అలా అట్లాంటాలో అడుగు పెట్టేదాకా సాగుతూనే ఉంది.

ఏ.వి.యస్‌గారు భువనకృతిని అసలు పేరు కాకుండా రకరకాల పేర్లతో పిలుస్తూనే ఉన్నారు. 'కవనజతీ,' 'జన జీవన స్రవంతి' లాంటి పేర్లు.

భువనకృతికి పదినిమిషాలకి ఓసారి 'ఆకలి' వేస్తూనే ఉంది. పైగా మా ముందున్న టీ.వీ మానిటర్‌లో వాల్యూమ్ రాకపోవడం చేత సినిమా చూడలేక చాలా డిసప్పాయింట్ అయింది. నేనూ శక్తివంచన లేకుండా బోలెడు కబుర్లు చెప్పాను. బోలెడు గాసిప్స్ విన్నాను.

దుబాయిలో 'వీల్ ఛైర్' తీసుకుంటే, 'వీలు'గా ఉంటుంది అనుకున్నాను. కానీ అది మా బృందం నుండీ నన్నూ, భువననీ వేరు చేసి, బోర్ కొట్టించింది.

ఈ లోగా వేణుమాధవ్ తెచ్చిన గారెలూ, మిగతా తినుబండారాలూ 'వాళ్ళు ఖతమ్ చేసేసారుట'

హ్యూస్టన్ చేరుకుంటుంటేనే కళ్ళు తిరిగాయి. ట్రైన్‌లో వెళ్తూ కిందకి చూస్తే నాకు మాత్రం చాలా భయం వేసింది. అక్కడ మా పోర్ట్ ఆఫ్ డెస్టినేషన్ కబట్టి, ఇమ్మిగ్రేషన్ కూడా అక్కడే ఒక్కొక్కరినీ పిలిచి, ఇన్విటేషన్ కార్డులు, చూసి ఏం చేస్తామో తెలుసుకున్నాడు అతను. భువనని మాత్రం ఓ పాటపాడమన్నాడు. "నే తొలిసారిగా కలగన్నదీ నిన్నేననీ.." అని మొదలు పెట్టేసింది. అతను నవ్వి "okay..fine..enjoy the stay" అనేసాడు.

స్వాతి "ఇంకా నయం నన్ను డాన్స్ చెయ్యమనీ, నిన్ను కథ చెప్పమని అడగలేదు" అంది.

అక్కడ లగేజ్ కలెక్ట్ చేసుకుని, ఎమిరేట్స్ కౌంటర్ దగ్గర మళ్ళీ అట్లాంటాకి చెక్ ఇన్ చేసేసాం. అక్కడే వచ్చింది తంటా!

ఎయిర్ పోర్ట్‌కి మమ్మల్ని రిసీవ్ చేసుకోడానికి బంగారు కొండల్లా లిటరరీ కమిటీ వాళ్ళంతా వచ్చారు. పార్థ రామరాజుగారూ, వాళ్ళ అన్నయ్య వంశీ రామరాజుగారూ, మా తమ్ముళ్ళు ఫణీ డొక్కా, మాధవ్ దుర్భా వచ్చారు.

మా ఫణి హేమని చూడగానే 'మీ ఎర్రపూల దుప్పటి తెచ్చుకున్నారా?' అంటూ అష్టా చెమ్మాలో డైలాగ్ గుర్తుచేసాడు. అందరూ ఆనందంగా 'హమ్మయ్య' చేరిపోయాం అనుకుంటూ ఉండగా, పిడుగులాంటి వార్త పార్థ రామరాజుగారు మోసుకొచ్చారు. 'మీ లగేజ్ రేపొస్తుందిట' అన్నారు. అంతా షాక్ తిన్నారు. నేను మొదటిసారి అయిన అనుభవం వల్ల ఓ మూడు జతల బట్టలు హేండ్ లగేజ్‌లో పెట్టుకున్నాను. మిగతా ఎవరికీ లేవు.

భువనకృతిని రిసీవ్ చేసుకోడానికి వాళ్ళ అక్క సుజలశృతి, బావా, అశ్వినీ అనే అక్క ఫ్రెండ్ ఇంకా కొంతమంది వచ్చారు. నేను లగేజ్ రావడానికి ఫణి అడ్రెస్ రాసిచ్చాను. ఈలోపల ఎయిర్‌పోర్ట్ సిబ్బంది మాకు చిన్న చిన్న నల్ల బ్యాగ్‌లు, అందులో ఒక టీ షర్ట్ బ్రష్, టంగ్ క్లీనర్, పేస్ట్ పెట్టి ఇచ్చారు. వాటికి మేం సరదాగా 'వాయినాలు' అని పేరు పెట్టుకున్నాం. మమ్మల్ని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన వాళ్ళకి కూడా రెండేసి ఇప్పించాం.

శ్రీనివాసరెడ్డి, రేపు లగేజ్ రాకపోతే ఈ టీషర్ట్సు వేసుకుని అంతా బాంక్వెట్‌కి వెళ్దాం. యూనిఫాంలా ఉంటుంది అన్నాడు.

అందరూ మేరియట్ హోటల్‌లో ఇచ్చిన రూమ్స్‌కి వెళ్ళిపోయారు. నేను మాధవ్, ఫణిలతో కలిసి ఫణి ఇంటికి వెళ్ళాను. అక్కడ ఫణి శ్రీమతి గాయత్రి చపాతీలూ, రెండు కూరలూ, గెడ్డ పెరుగుతో మా కోసం వెయిట్ చేస్తోంది. గుమ్మంలో అడుగు పెట్టగానే ఆప్యాయంగా 'అక్కా' అని పిలిచింది. గాయత్రి వంట చాలా బాగా చేస్తుంది (అందుకే మా తమ్ముడు ఇంకా ఫారెక్స్ బేబీలా ఉంటాడు.)

నేను వెళ్ళేసరికే వాళ్ళింట్లో రాధికా నోరీ అనే రచయిత్రీ కం గాయకురాలూ, ఆవిడ భర్తా, పిల్లాడూ ఉన్నారుట. నేను చూడలేదు నిద్రపోయాను.

మేం కబుర్లు చెప్పుకుని ఏ ఒంటిగంటకో పడుకున్నాం. తెల్లవారు ఝామున మూడు గంటలకి రాధికా నోరిగారు తలుపులు కొట్టి నన్ను నిద్రలేపి, బాత్ రూం డోర్ లోపలనుండి లాక్ చేసి ఉంది, తియ్యమంది. అదే ఆవిడ్ని చూడడం.

తెల్లవారాక అక్కడ సుజాతా ఈమనీ అనే ఓ పాత స్నేహితురాలు కూడా కనిపించింది. వాళ్ళ ఆయన స్వరూప్‌కి మా తమ్ముడు సాయికృష్ణ అప్పట్లో కె.యస్, రామారావుగారి దగ్గర ఉద్యోగం వేయించాడు. మా సుమిత్రా పంపనకి అతను కొలీగ్. గ్రాఫిక్స్ చేసేవాడు.

సుజాతా, గాయత్రీ నేను నిద్రలేచేసరికే యుద్ధ ప్రాతిపదిక మీద వంట చేసేస్తున్నారు. పొడుగు వంకాయలు ఓ పక్కన క్యాబేజీ పక్కన తరిగి ఉన్నాయి.

నన్ను చూడగానే 'అక్కా నిద్రపట్టిందా?' అని పలకరించి ఇడ్లీలూ, చట్నీ పెట్టారు.

భోజనాల టైందాకా సుజాతా, నేనూ మాకు తెలిసిన సినిమా వాళ్ళ గురించి కబుర్లు చెప్పుకున్నాం. గాయత్రికి వాళ్ళు తెలియకపోయినా 'I love gossips' అంటూ ఎంజాయ్ చేసింది.

మధ్యలో 'అక్కా... నాకు చిన్నప్పటినుండీ ఒక కోరిక.. సినిమాల్లో ఎక్స్ట్రా వేషం వెయ్యాలని' అంది.

'హీరోయిన్లని తలదన్నే అందగత్తెవి. నీకు ఎక్స్ట్రా వేషం ఏం ఖర్మ?' అంటే

'నాకు అదే కావాలి.. లైఫ్ ఏంబిషన్' అంది.

గాయిత్రికి ఇప్పుడు ఆరోనెల, కేరీయింగ్ అయికూడా చకచకా



సురేఖ, అపర్ణ, రమణి, గాయత్రి, సుజాత, రాధికా నోరి

ఇంటిపనీ, వంటపనీ ఆఫీస్ పనీ, చేసుకుంటున్న గాయిత్రిని చూసి మా ఫణికి తగిన జోడీ అనిపించింది. వాళ్ళ చిరు బంగారం పల్లవి, బంగారు బొమ్మ. సహజ పాండిత్యంతో పియానో వాయించడం, పాటపాడడం, డాన్స్‌లు చెయ్యడం అన్ని నేర్చేసుకుంది.

రాధిక నోరీగారు, ఫణితో కలిసి రిహర్సిల్స్ నుండి వచ్చారు. ఈలోగా వాళ్ళాయన ఓ పెద్ద సంచెడు మందులు వేసుకుని రెడీ అయ్యారు.


సాధన

సురేఖా, శ్రీప్రీ అనే దంపతులు, వారి ఇంటికొచ్చిన మేనల్లుడూ, వాళ్ళబ్బాయి వచ్చారు. భోజనాల సమయానికి మాధవ్ దుర్భా, వాళ్ళావిడ అపర్ణా, పిల్లలు సాధనా, ఆదిత్య వచ్చారు. అపర్ణ అక్కడ పీడియాట్రిషియన్‌ట. బిజీ ప్రొఫెషన్‌లో ఉండి కూడా ఆ అమ్మాయి ఇంతమందికి రుచికరమైన పకోడీలూ, దోసకాయ పచ్చడీ, లక్ష్మీపార్వతిగారు తెచ్చిన అరిశలూ పట్టుకుని వచ్చింది. అమెరికాలో ఆడపిల్లలు ఇంతింత చదువుకుని, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తూ కూడా, ఇంటికొచ్చిన అతిధులని చూసుకుంటూ, నలభయి మందికి వంట చేస్తూ (ఆ తరువాత అంట్లు తోముకుంటూ) ఇంత సమర్ధవంతంగా పనిచేసుకుంటున్నారా? ఏం కాలమొచ్చిందో కానీ, మన తెలుగునేల మీద ఒక్క ఆడపిల్ల వంట చెయ్యదు 'రాదు' అనడానికి సిగ్గుపడదు. ఇంటికి అత్తా మామా వస్తే కేటరింగ్ ఆర్డర్ ఇస్తారు.

చిరంజీవి సాధన స్పెల్లింగ్ కాంటెస్ట్ అన్ని గ్రేడ్స్ విన్ అయింది. న్యూజెర్సీలో బహుమతి ప్రదానం.

గాయిత్రీ సుజాతా కలిసి, కొత్తిమీర కారం పెట్టి వంకయకూర, (ఇది గాయిత్రే చేసింది) క్యాబేజీ, బంగాళదుంపల కూర, (ఫణి బంగాళా దుంపలు తరిగి పెట్టే రైట్ తనదే అంటూ బంగారు కణికల్లాంటి ముక్కలు తరిగి పెట్టాడు) సాంబారు, గెడ్డ పెరుగుతో భోజనాలు పెట్టారు. (ఆ తరువాత కన్వెన్షన్ సెంటర్‌కి వెళ్ళడం అవసరమా? కాసేపు కునుకు తియ్యకుండా అని కూడా అనిపించింది అనుకోండీ.)

ఫణీ, మాధవ్ నన్ను మేరియట్ హోటల్‌కి తీసుకెళ్ళేసరికి అక్కడ ఆల్‌రెడీ కిరణప్రభగారూ, వాళ్ళావిడ కాంతికిరణ్ వచ్చి ఉన్నారు.



కాంతిగారూ, నేనూ ఒకర్ని ఒకరం చూసుకుని ఆనందరాగ జలధి తరంగి గంగ..... ఎక్స్‌ట్రా అయ్యాం. కాసేపటికి మాధవ్ తలుపు కొట్టి లక్ష్మీపార్వతిగారొచ్చారు అన్నారు.

లక్ష్మీ పార్వతిగారు కూడా నన్ను కౌగిలించుకుని ఆనందరాగ...... ఎక్స్‌ట్రా అయ్యాకా, అందరం తయారయి (నేను తెలుపు ప్రింటెడ్ ధర్మవరం పటుచీర కట్టుకుని) కారిడార్‌లోకి వచ్చేసరికి, ఇంకా సూట్‌కేస్‌లు రాలేదని కట్టుబట్టలతో మా శిల్పా, స్వాతీ దిగులుగా కనిపించారు. " వస్తున్నాయి... దార్లో ఉన్నాయి. నా సూట్ కేస్ వచ్చిందని ఇప్పుడే గాయిత్రి ఫోన్ చేసింది" అని చెప్పి ఊరడించాను. అలాగే ఇంకాసేపటికి వచ్చాయి.

బాంక్వెట్‌కి వెళ్ళి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. కిరణప్రభగారికీ, కాంతిగారికీ చిలకాకు పచ్చ ట్యాగ్ ఇచ్చి నాకు రెడ్ ట్యాగ్ ఇచ్చారు. నన్ను ఎక్కువగా గౌరవిస్తున్నారేమో రెడ్ ట్యాగ్ ఇచ్చారు అని వాళ్ళు అనుకున్నారు. కానీ అదేమీ కాదు. నేనూ మాధవ్ అజ్ఞానం వలన రెడ్ ట్యాగ్ తీసుకున్నాం. చిలక పచ్చదే వి.వి.ఐపీలది. మొత్తానికి ఎలాగో మేనేజ్ చేసి, స్నాక్స్ తీసుకుని తెలిసిన వాళ్ళందర్నీ పలకరిస్తూ, బాంక్వెట్ హాల్లోకికి నడిచాం.


రఘునాథ్ కొత్తా, జ్యోతిర్మయీ కొత్తా

రఘునాథ్ కొత్తాగారూ, జ్యోతిర్మయీ కొత్తాగారు కూడా కలిసారు. ఆయన 'ఆటా 2012' మేగ్‌జైన్‌ని ఎడిట్ చేసారు. దానికోసం నేను 'అపరిచితులు' అనే కథను పంపాను. అప్పుడు ఫోన్లో మాట్లాడాను వారితో. ఇప్పుడు ప్రత్యక్షంగా కలిసాను. మా జాతే. సరదాగా కలిసిపోయే స్వభావం వాళ్ళది.

బాంక్వెట్‌లో విభిన్న రంగాలలో కృషి చేసిన తెలుగువారికి అవార్డులిచ్చారు. కిరణ్‌ప్రభగారికి కూడా అవార్డు ప్రదానోత్సవం జరిగింది. మేమంతా చప్పట్లు కొట్టాం.

ఫణిది ఇక్కడ ఓ చిన్న ట్రాజెడీ స్టోరీ, ఎవరో ఫణి పేరు అనుకున్నాక, 'చిన్న వయసు, అప్పుడే అవార్డు ఎందుకు' అన్నారుట ఓ ఛైర్ మెంబర్. పాప 'ఝుమ్మంది నాదానికి వెళితే 'వయసు ఎక్కువైంది.. చిన్నపిల్లలకి ఈ ప్రోగ్రాం అన్నారుట. 'వయసు తక్కువై అవార్డు పోయింది. ఎక్కువై పాటపాడే ఛాన్సే పోయింది' అని రాసుకున్నాడు.

మొదట పల్లవీ, సాధనా ప్రార్థనా గీతంలో తమ గొంతు కలిపారు. అప్పుడు ఆడియో క్వాలిటీ బావుంది. తర్వాత పోయింది. భువనకృతి పాడుతుంటే, వాళ్ళ అక్క వీడియో తీసింది. నేను వాళ్ళ బావని పట్టుకుని, నా సూట్‌కేస్ వాళ్ళ రూంలో నుండి తెచ్చి పెట్టమని వేటాడాను.

మా ఫణీ, మాధవ్ ఓపిగ్గా, నా సూట్ కేస్ గాయిత్రి దగ్గర నుండి సుజలకృతీ వాళ్ళు తెస్తే, వాళ్ళరూం నుండి నా దాకా చేరేసి, నా హోటల్ రూంలో పెట్టించేదాకా నిద్రపోలేదు. ఆ రోజు డిన్నర్ బావుంది.

మిగతా రెండు రోజులూ ఎలా గడిచిపోయాయో మాకే తెలీదు. షటిల్ ఎక్కి నేనూ, కాంతిగారూ, కిరణ్‌ప్రభగారూ రూంకి రావడం, మళ్ళీ ఏడుగంటలకల్లా తయారయి వెళ్ళడం, మళ్ళీ ఏడుగంటలకల్ల తయారయి వెళ్ళడం, లంచ్, ప్రోగ్రామ్స్, రాత్రి (ఐదున్నర నుండీ ఏడు వరకు డిన్నరట) మేం రూంకి వచ్చి వెళ్ళేసరికి మిస్ అయ్యాం.





ఏపిల్స్, బనానాస్ తిని పడుకున్నాం.

మా లిటరరీ ప్రోగ్రామ్స్‌లో మొదటి రోజు అశోక్ తేజా, నేనూ మాట్లాడాం.

మొదటిగా నేను 21వ శతాబ్దంలో ఆడ రచయితల భవిష్యత్తు గురించి మాట్లాడ్తూ, మూడు మీడియాలలో నా అనుభవాలు చెప్పాను. తర్వాత ప్రేక్షకుల ప్రశ్నోత్తరాలు రంజుగా సాగాయి. అందరూ దాదాపు టీ.వీ సీరియల్స్ ధోరణి బాగోలేదు వాటిని మార్చడానికి మీరేం చేస్తారు అని అడిగారు. వాడి వేడిగా జరిగిన ఆ కార్యక్రమంలో నేను "ఆపేసే ఆయుధం మీ చేతుల్లో ఉంది. రిమోట్ ఉపయోగించండి. చూడడం మానేస్తే, వాళ్ళే ఆపేస్తారు. టీ.ఆర్.పి రాకపోతే ఛానెల్ వాళ్ళు ప్రసారం చెయ్యరు" అని గట్టిగా చెప్పాను. కానీ నాకు తెలిసి ఈ ఏడుపు గొట్టు సీరియల్స్ ఇష్టం లేదని చెప్పే ఆడవాళ్ళంతా చూస్తారు. ఇక్కడ కష్టాలు అయిపోతే, వేరే సీరియల్‌కి వెళ్ళి అక్కడ చూస్తారు. లేడీ విలన్స్ ఆగడాలు అసహ్యించుకుంటూనే అందరూ చూస్తారు. అందుకే మా గాయిత్రి

"అక్కా. నేను టీ.వీలో విలన్ వేషాలు వెయ్యడానికి పనికొస్తానా?" అని అడిగితే

"చాలా కష్టం తల్లీ అందుకు చాలా మెళుకువ కావాలి" అని చెప్పాను.

ఒక అబ్బాయి లేచి "నేను లిటరరీ సభకి వస్తుంటే, మా ఫ్రెండ్స్ అంతా నా వైపు జాలిగా చూసారు.. ఈ వయసులో ఇదేంటీ అని" అన్నాడు.

"అవును బాబూ. నేనే ఓ సినిమాలో రాసాను. హీరో హీరోయిన్లు ఏకాంతం కోసం ఎక్కడికెళ్ళాలా అని ఆలోచించి "రవీంద్రభారతిలో ఏదో సాహిత్య సభ జరుగుతోంది. అక్కడికి వెళ్ళి కూర్చుందాం. ఎవరూ ఉండరు హాయిగా" అంటాడు అని నేను చెపితే అంతా నవ్వారు. కానీ అది నిజం. సాధారణంగా ఇలాగే ఉంటుంది. కానీ మా విప్లవ సినీకవి సుద్దాల అశోక్ తేజ నా మాట నిలబెట్టలేదు. నాకు ఆనందం కలిగించాడు తన మాటతో, పాటతో. హాల్ జనంతో కిక్కిరిసిపోయేట్లు చేసాడు. వాళ్ళ నాన్నగారు సుద్దాల హనుమంతు కవిగారి 'పల్లెటూరి పిల్లగాడా.... పశులు గాసె పిల్లగాడా.. పాలు మాని ఎన్నాళ్ళయ్యిందిరా? ఓ.. పాల బుగ్గలా జీతగాడా" అనే పాట నేను అడిగి మరీ పాడించుకున్నాను.

వెంకట్ అనే అబ్బాయి "లీలా మహల్ సెంటర్ కాడ బాలామణీ.. నీతో పని ఉందే బాలామణీ" పాట ఏ ఇన్స్పిరేషన్‌తో రాసారు? అని అడిగితే, అశోక్ తేజ చాలా బాధపడుతూ "అన్నీ డిజైర్ పాటలే ఉండవు..



కొన్ని డీజిల్ పాటలు కూడా ఉంటాయి. మా సోదరి బలభద్రపాత్రుని రమణి ఇందాక తనకు నచ్చకపోతే తాను రాయడం మానేస్తానని చెప్పింది. కానీ నేను అలా చెయ్యలేను. అది నా జీవనోపాధి. నేను కాకపోతే ప్రొడ్యూసర్ కోరినట్లు



ఇంకొకరొచ్చి రాస్తారు" అని వివరణ ఇచ్చారు. తర్వాత పుస్తకావిష్కరణలు జరిగాయి. నా 'కాలమ్ దాటని కబుర్లు' పుస్తక పరిచయం కిరణ్‌ప్రభ చేసారు. ఫణి 'టేకిట్ ఈజీ పుస్తక పరిచయం నేను చేసాను.

ఆటా వాళ్ళు వెబ్ సైట్‌లో అల్లు అర్జున్, అనుష్క.....ఇంకా చాలా మంది ఫోటోలు పెట్టారు. వాళ్ళంతా 'ఉత్తిత్తిగా' వచ్చినట్లే, వెబ్‌సైట్లో బొబ్బట్లూ, బూరెలూ, గారెలూ, పూతరేకులూ, లడ్డూలూ అన్నీ 'ఉత్తుత్తి'గా పెట్టారు. మాకు మాత్రం మూడురోజుల పాటు ఒకే టిఫిన్స్ ఉప్మా, పొంగల్ పెట్టారు.

తెలుగువారికి కాఫీ అన్నా కాపీ అన్నా చాలా ఇష్టం అని జోక్ పేలుస్తుంటారు. అలాంటిది కాఫీ కూడా లేదు. టీ మాత్రం ఇచ్చారు. కొన్ని సార్లు పెరుగు పచ్చడీ, పప్పూ, కూరలూ తప్ప అన్నం కూడా లేదు. "సారీ వీ కేంట్ గివ్ .. ఓవర్" అని నల్లాళ్ళు పొలైట్‌గా లేచి పొమ్మన్నారు.

మెయిన్ స్టేజ్ మీద ఎవరు మైక్ పట్టుకున్నా చాలాసేపు అంటుకుపోయారు. దానికేం జిగురుందో? ఎవరో తెలుగు రచయిత్రి, కల్చరల్ ఛైర్ ఆవిడ "వెంపటి చిన సత్యంగారికి 'శ్రద్ధాంజలి' అంది." ఆయన బతికున్నందుకు బాధపడ్డారేమో విని! *(ఈ వ్యాసం వ్రాసేప్పటికి శ్రీ వెంపటి చినసత్యంగారు సజీవులుగా ఉన్నారు)* ఆ మహానుభావుడిని లైవ్ చూపించే ప్రయత్నం చేసి ఘోరంగా ఫెయిల్ అయ్యారు. మా శిల్పా చక్రవర్తి కూడా చాలామంది తెలుగు వాళ్ళకి 'నివాళులు' అర్పించేసింది. (తనంటే బెంగాలీ పిల్ల పాపం. వదిలెయ్యచ్చు)

మనసుకి ఊరటగా పసిపిల్లలు చేసిన నృత్య రూపకాలు మాత్రం చాలా బావున్నాయి. పిల్లలు పాడిన స్వాగత గీతాలు కూడా అలరించాయి..

ఇంక బయట హైదరాబాద్‌లో రెండు వేలకి కొనుక్కొచ్చిన చీరలు ఇక్కడ రెండొందల డాలర్లకి అమ్మారు. మా గాయత్రి "ఈ డిజైనర్ దోమతెర గుడ్డ మీ ఊళ్ళో ఎంతుంటుంది అక్కా?" అని అడిగి అన్ని రేట్లూ కనుక్కుంది. మరి తెచ్చినందుకు వాళ్ళూ ఒక్కో చీర మీదా పది, పదిహేను వేలు సంపాదించాలి కదా!

ఆర్టిస్ట్ జయలలిత కూడా కనపడి షిరిడీబాబా గుడి కోసం చందాల పనిమీద వచ్చాననీ, నెక్స్ట్ కాలిఫోర్నియా వస్తున్నాననీ చెప్పింది. ఇంకా తెలుగు వన్ డాట్ కామ్ రవి శంకర్, టీ.వీ, రవిప్రకాష్, రజనీకంత్, వడ్డేపల్లి కృష్ణగారు, తోటకూర ప్రసాద్‌గారు, T – టీ.వీ ఏంకర్ రాణీరుద్రమ, ప్రగతి శీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్యా, గజల్ శ్రీనివాస్, రేవంత్ సింగర్, ఇలా చాలామంది కనపడ్డారు.

మా సాహిత్య సభల్లో కెనడా నుండి వచ్చిన సరోజ కొమరవోలు గారూ వాళ్ళాయన బాల సుందర రావుగారూ చాలా సరదాగా మాతో కలసిపోయారు. ఆడవాళ్ళం అందరం దూరదర్శన్‌లో సంప్రదాయ సంగీతం ప్రోగ్రాంలో లాగా పట్టు చీరల్లో వరుసగా ఫోటోలు తీయించుకున్నాం. నిహాల్ వాళ్ళక్కయ్య ప్రసూనాంబగారు వచ్చి 'నిహాల్ మా తమ్ముడండీ' అని చెప్పారు. 'నిహాల్ నాకూ తమ్ముడే లెండి' అన్నాను. ఆమె ఆనంద పడింది.

ఇంక హోటల్‌కి వెళ్ళాక లాబీలో నిలబడి వంశీరామరాజుగారూ, బాలా రాజశేఖరునీ, స్వాతీ, నేనూ, కిరణ్‌ప్రభగారు, కాంతిగారూ చాలాసేపు సమీక్షించుకున్నాం. పొద్దున్నే అష్టావధానం ఉంది గరికపాటాయనది అని ఒకొళ్ళకొకళ్ళం చెప్పుకుని అర్ధరాత్రి నిద్రకి ఉపక్రమించాం.

మాధవ్ దుర్భాని మొదట అభినందించాలి. మెయిన్ స్టేజ్‌మీద శ్రీ గరికపాటి నరసింహారావు అవధాని గారి అవధానం పెట్టించాడు.




తెర వెనుక ఉంది మా ఫణీ, రామ్ దుర్వాసుల, పార్ధ రామరాజుగార్లు మాధవ్‌కి సహాయం చేసారు. మాధవ్ చెరగని చిరునవ్వు ఆభరణంగా ఈ లిటరరీ విభాగం మహారంజకంగా నిర్వహించాడు.

ఆ రోజు మా సాహితి ప్రియులందరం మొదట వరసలో

కూర్చున్నాం. ఎవరికీ మమ్మల్ని లేవదీసే హక్కుని మేం ఇవ్వలేదు.

రెండున్నర గంటలపాటు అవధానిగారు, శారదాపూర్ణ శొంఠిగారి అధ్యక్షతలో, లక్ష్మీపార్వతీ, ఫణీ డొక్కా, కిరణ్‌ప్రభా, సుద్దాల అశోక్ తేజా, వడ్డేపల్లి కృష్ణా, శశికళ, ఇంకో ఇద్దరు పృచ్ఛకులతో ఏకాదశావధానం పేరుతో అవధానం జనరంజకంగా సాగింది.అవధానిగారి చణుకులు ఆసాంతం నవ్వించాయి. అసలు కాలం తెలియలేదు. ఆయన అద్భుత చమత్కృతిని చూసి, నా మనసులో దిగులు.. ఈ తియ్యని గెడ్డ పెరుగు లాంటి తెలుగుకి మా తరువాత తరాలు దూరం అయిపోతున్నయి కదా! కనీసం హైదరాబాద్‌లో పిల్లలకి తెలుగు అక్షరాలు చదవడం కూడా రాదుకదా అని.

అవధానం ముగిసే సమయానికి మేమంతా స్టేజ్ మీద ఉన్నాం. అనాలోచితంగా, అప్రయత్నంగా ఆ పండితుడి పాదాలకి నమస్కారం చేసాం. నమస్కారం ఎప్పుడూ అప్రయిత్నంగానే చెయ్యాలి. (ఇది తెలియని సినీపరిశ్రమలోని దండనాథులు కొంతమంది బలవంతంగా దండాలు పెట్టించుకుంటారు. మనం దగ్గరికి వెళ్ళగానే తలమీద చెయ్యి వేసి బలంగా వంచేసి మరీ.)


ఆ రాత్రికి అందరం సరదాగా దొరికినంత వరకూ భోజనాలు చేసి, హోటల్ రూం కొచ్చి పడ్డాం. మధ్యలో నేను ఉమెన్స్ ఫోరమ్‌లో కూడా మాట్లాడాను. దానిలో నాతోబాటు లేట్ మినిస్టర్ శ్రీపాదరావుగారి సతీమణీ, మరియూ సివిల్ సప్లైస్ మినిస్టర్ శ్రీధర్ బాబుగారి తల్లి అయిన జయశ్రీ దుద్దుల గారు కూడా పాల్గొన్నారు. ఆవిడకి నేను చంద్ర సిద్దార్ధ సినిమాలకి కథలిచ్చానని చెపితే, "మా శ్రీధర్ క్లాస్ మేట్ చంద్రసిద్ధార్ధ, అతనితో ఓసారి ఇంటికి రా తల్లీ" అని ఆప్యాయంగా పలకరించి, కోడళ్ళకి పరిచయం చేసారు.

ఉమెన్స్ ఫోరమ్ రాజీ అక్కినేనీ, మరికొందరు అమ్మాయిలు నిర్వహించారు. నేను మాట్లాడుతుంటే ఊరుకున్నారు కానీ, (నేను టైం దాటలేదు) మిగతా వాళ్ళు ఎవరు మాట్లాడున్నా వాళ్ళు మైక్ లాగేసుకుని, వాళ్ళ స్పీచ్ కన్‌క్లూడ్ చేసేసారు. నాకు వాళ్ళని చూస్తే ముచ్చటేసింది. రాజీ తెలుగులో మాట్లాడి ఉంటే ఇంకా బావుండేది. మధ్యలో జిన్నాగారూ, తోటకూర ప్రసాద్‌గారూ వచ్చి విమెన్స్ ఫోరమ్‌ని మెచ్చుకున్నారు. పద్మశ్రీ ముత్యాలగారు కూడా అక్కడ కనపడ్డారు.

ఇలా హడావిడిగా మూడురాత్రులూ, మూడు పగళ్ళూ ఉప్మా తింటూ, పట్టుచీరలు మార్చుకుంటూ గడిపి, నేను కిరణ్‌ప్రభ దంపతులతో కలిసి ఆరుగంటలు ప్రయాణం చేసి కాలిఫోర్నియా వచ్చిపడ్డాను. ఇవన్నీ మీకు అందించాలని తొందరలో హడావిడిగా రాస్తున్నాను. ఎవరినైనా నేను మరిచిపోతే క్షమించాలి. బహుశా వాళ్ళు ఆనందపడ్తారు.

మళ్ళీ ఇంకోసారి కలుద్దాం. ఇప్పటికి టాటా.. బైబై..

Click here to share your comments on this story.


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
సాహితి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి